www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 30 ఏప్రిల్ 2023
5
అన్నమయ్య

జెఇఇ మెయిన్స్‌లో 'సిద్ధార్థ' విద్యార్థులకు జాతీయ స్థాయి ర్యాంకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎన్‌టిఎ విడుదల చేసిన జెఇఇ మెయిన్స్ ఫలితాలలో స్థానిక శ్రీవెంకటరెడ్డి సిద్ధార్థ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఇ.వెంకటరెడ్డి, ఎఒ హేమంత్ కుమార్ తెలిపారు. మహమ్మద్ సాకిబ్ 98.57 శాతం, ఇ.రిషికేశ్‌రెడ్డి 95.97 శాతం, ఎస్.మసూద్ అహ్మద్ 99.99 శాతం సాధించి జిల్లాలో మొదటి, రెండు స్థానాలు సాధించినట్లు తెలిపారు. వీరితోపాటు వివిధ కేటగిరీల్లో జెఈఈ అడ్వాన్స్‌ ఐఐటికి 37 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు తెలిపారు., విజయానికి తోడ్పడిన అధ్యాపకులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ వెంకటరెడ్డి

బిజెపి విధానాలు దేశానికే ప్రమాదం

సిపిఎం-సిపిఐ రాజకీయ ప్రచార భేరి బహిరంగ సభలో వక్తలు

సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

కేంద్రంలో బిజెపి అమలు చేస్తున్న విధానాలతో దేశ ప్రగతికి నష్టం వాటిల్లుతోందని వక్తలు పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి విధానాలకు వ్యతిరేకంగా రాయచోటి బస్టాండ్ సర్కిల్‌లో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో బిజెపిని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందాం, ప్రచార భేరి బహిరంగ సభ నిర్వహించారు. ఈసందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాసులు, పి.ఎల్.నరసింహులు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ అమలు చేస్తున్న విధానాలతో అన్ని రకాల ధరలు పెరుగుతున్నాయన్నారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు, గ్యాస్ ధరలు పెరగడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో 32 మంది ప్రాణ త్యాగలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రయివేటీకరించడం అన్యాయమని వాపోయారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తే రిజర్వేషన్లు అమలు కావని, లక్షలాదిమంది కార్మికులు, ఉద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై మోడీ ప్రభుత్వం దాడి చేస్తుం దన్నారు. రాజ్యాంగ హక్కులు పరిరక్షణకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పోరేట్ సంస్థలకు కారుచౌకగా అమ్మివేస్తున్నారని వివర్శించారు. సమ్మె, కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని వాపోయారు. ఉపాధి నిధులలో కోత పెట్టి పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ అధికారంలోకి వచ్చిన మోడీ ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదన్నారు. పెద్దనోట్లు రద్దు చేసి ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని మండిపడ్డారు. బిజెపి వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే మతో న్మాదాన్ని రెచ్చగొడుతున్నారన్నారు. మోడీని గద్దె దించితేనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బలం లేకపోయిన వైసిపి, టిడిపిలు బిజెపి విధానాలకు మద్దతు ఇస్తున్నారన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకించకపోవడం అన్యాయమన్నారు. జిల్లా అభివృద్ధి కావాలంటే హంద్రీనీవా, కడప, బెంగళూరు రైల్వే లైన్ పూర్తి చేయాలని పేర్కొ న్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అదాని, అంబాని ఆస్తులను పెంచేందుకు మోడీ పనిచేస్తున్నారని చెప్పారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించేందుకు జనసేన పెట్టనని చెప్పిన పవన్ కల్యాణ్, బిజెపి వైఫల్యాలను ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేసే దమ్ము, ధైర్యం వామపక్షాలకు మాత్రమే ఉందని ఉద్ఘాటించారు. ప్రజలు, కార్మికులు, రైతాంగ సమస్యలు పరిష్కారానికి వామపక్షాలు పోరాటం చేస్తాయన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ నాయకులు చిన్నం పెంచలయ్య, సిపిఎం నాయకులు హరిశర్మ, సిపిఐ జిల్లా నాయకులు కృష్ణప్ప, మహేష్, రంగారెడ్డి, సాంబశివ, సిపిఎం నాయకులు నరసింహ, భాస్కర్, సిఐటియు జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సుమిత్ర పసంగించారు. సిపిఎం నాయకులు ఫయాజ్ ఆహ్వానం పలికి, వందన సమర్పణ చేసిన కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ నాయకులు కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

సభకు హాజరైన ప్రజలు, వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు

రైతులు నష్టపోకుండా చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-వాల్మీకిపురం/పీలేరు

ఎన్‌హెచ్-71 మదనపల్లి-పీలేరు నాలుగు లైన్ల జాతీయ రహదారి విస్తరణ కోసం భూములు కోల్పోయిన రైతులు నష్టపోకుండా న్యాయం చేస్తామని కలెక్టర్ గిరీష అన్నారు. జాతీయ రహదారి కోసం తమ వద్ద తీసుకున్న భూములకంటే అదనంగా ఎన్‌హెచ్ అధికారులు మార్కింగ్ ఇవ్వడం వలన తాము భూములను అధికశాతం కోల్పోయామని బాధిత రైతులు గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శనివారం మండలంలోని తాటిగుంటపల్లి, మూరేవాండ్లపల్లి పంచాయతీలకు సంబంధించిన భూములను స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి కలెక్టర్ పరిశీలించారు. జాతీయ రహదారి విస్తరణలో సర్వే నెంబర్ 595, 596, 624లో ఉన్న ఇండ్లు, గుడి, మసీదు జాగాకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న భూముల కంటే అదనంగా ఎన్‌హెచ్ అధికారులు మార్కింగ్ ఇవ్వడం వలన తాము నష్టపోయామని రైతులు కలెక్టర్‌కు వాపోయారు. దీంతో పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ మురళి, తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్, సర్వేయర్ శ్రీనివాసులు, ఆర్ఐ బాబ్జి, రెవెన్యూ సిబ్బంది, బాధిత రైతులు పాల్గొన్నారు.

అనంతరం పీలేరు మండలంలోని బోడంవారిపల్లెలో జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బోడంవారిపల్లెలో 50 మంది జాతీయ రహదారికి భూములు కోల్పోయే బాధితులు ఉన్నారన్నారు. వీరందరూ ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారాన్ని తీసుకొని తర్వాత మీకు నష్టపరిహారం సరిపోకపోతే ఆర్బిట్రేషన్ సమర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవి, సర్పంచ్ నటశేఖర్, మండల సర్వేయర్, ఎన్‌హెచ్ ఎఇ సైట్ ఇంజనీర్లు వెంకటరమణ, శ్రవణ్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : ఇళ్లు కోల్పోయిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీష

'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

ప్రజాశక్తి - రాయచోటి

సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వ అమలు చేయాలని ఎపి జెఎసి నాయకులు పేర్కొన్నారు. శనివారం ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు వద్ద జిల్లా అధ్యక్షులు నరసింహ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగుల సంఘంజిల్లా అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి మల్లికార్జున అధ్యక్షత గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాలు సంక్షేమ పథకాల అమలులో అహర్నిశలు శ్రమిస్తున్న తమకు చట్టబద్ధంగా రావాల్సిన అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సచివాలయ సిబ్బంది బదిలీల విషయంలో పునఃపరిశీలన చేసి, అన్ని వర్గాల వారికి అవకాశం కల్పిస్తూ వెంటనే పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రొబిహిషన్ డిక్లరేషన్‌కు, డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు ముడిపెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో జరిగే ఉద్యమాలకు ఉద్యోగాలు, ఉపాధ్యాయులు సచివాలయం సిబ్బంది, అవుట్ సోర్సింగ్, కాంటాక్ట్ ఉద్యోగులు, పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించే వరకూ ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌టిసి యూనియన్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు మాధవి, వేణు, లక్ష్మి నారాయణ, హరి ప్రసాద్,శి వశంకర్ రాజు, సోమేశ్వర,వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

హామీలు నెరవేర్చిన ఘనత జగన్‌దే : మంత్రి పెద్దిరెడ్డి

మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 98.44 శాతం నెరవేర్చిందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం మండలంలో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని పలు గ్రామాల్లో శుద్ధ నీటి ప్లాట్లను ప్రారంభించారు. పీలేరు గ్రామ పంచాయతీ భవనం మొదటి అంతస్తును కూడా ప్రారంభించారు. అనంతరం స్థానిక కడప రోడ్డులోని ఎంఎం ఫంక్షన్ హాల్లో జరిగిన పీలేరు, కె.వి.పల్లె మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలోనూ మంత్రి పాల్గొని మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు బాబు వస్తే జాబు వస్తుందని, డ్వాక్రా రుణాలతో పాటు రైతులు తీసుకున్న అన్ని రకాల రుణాలను కూడా మాఫీ చేస్తామని హామీ ఇచ్చాడని, తీరా అధికారంలోకి వచ్చాక ఆ మాటలు తుంగలో తొక్కాడని చెప్పారు. అవసరానికి ఓ మాట చెప్పి ప్రజలను మభ్యపెట్టడం చంద్రబాబు నైజమన్నారు. బాబు మాటలు నమ్మి ప్రజలు ఎవరూ బోల్తా పడవద్దని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హెచ్చరించారు. రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. పీలేరు మండలంలో 50 శుద్ధ నీటి ప్లాంట్లు ఏర్పాటు జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రూ.2,400 కోట్లతో వైయస్సార్ జిల్లాలోని గండికోట రిజర్వాయర్ నుంచి వెనుకబడిన నియోజకవర్గాలైన పీలేరు, మదనపల్లి, తంబళ్లపల్లి, రాయచోటికి తాగు, సాగునీరు అందివ్వనున్నామని పేర్కొన్నారు. సదుం మండలంలోని ఆవులపల్లి రిజర్వాయర్ నుంచి రూ.672 కోట్ల వ్యయంతో సదుం, సోమల, పులిచర్ల రొంపిచర్ల, పీలేరు మండలాలకు తాగునీరు అందివ్వనున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చంద్రయ్య అనే వ్యక్తికి రూ.4 లక్షలు, వెంకట లక్ష్మమ్మ అనే మహిళకు 2.25 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్ ఖాన్, ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి, పీలేరు ఎంపీపీ కంభం సతీష్ కుమార్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, జడ్పీటీసీ ఏటి రత్నశేఖర్ రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎండి షఫీ, పీలేరు నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, అన్నమయ్య జిల్లా మహిళా కన్వీనర్ మహిత ఆనంద్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథ్ రెడ్డి, నల్లారి తిమ్మారెడ్డి, పీలేరు, కె.వి పల్లి మండలాల ప్రజా ప్రతినిధులు, వైసిపి కార్యకర్తలు, జిల్లా, డివిజన్, మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. మంత్రికి పీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద, దొడ్డిపల్లి వద్ద గజమాలలతో స్వాగతం పలికారు.

అవినీతిని నిర్మూలించాలి : 'గడికోట'

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సబ్ రిజిస్ట్రార్, తహశీల్దార్ తదితర ప్రభుత్వ కార్యాలయాలలో అవినీతిని పూర్తిగా నిర్మూలించాలని వైసిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూముల విలువ పెరగడంతో అమ్మకాలు, కొనుగోళ్లల్లో అవినీతి బాగా పెరిగిందని వాపోయారు. అవినీతిని అరికట్టాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైతం పూర్తిగా అవినీతిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎక్కడ అవినీతి జరిగినా చర్యలు చేపట్టేందుకు విజిలెన్స్, ఎసిబి ఇతర విభాగాలు కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సిఎం సూచించారని చెప్పారు. ప్రభుత్వ భూములను కాపాడడం ప్రధాన ఉద్దేశం అన్నారు. సామాన్యుడు రెవెన్యూభూముల రిజిస్ట్రేషన్ విషయంలో తప్పుడు పత్రాలతోను, లంచాల కారణంగా నష్టపోకూడదన్నది తమ ఉద్దేశం అన్నారు. సబ్ రిజిస్ట్రార్, తహశీల్దార్ కార్యాలయాలలో అవినీతి ఎక్కువగా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏ ఒక్క కార్యాలయంలోనూ అవినీతి పనులకు తన పేరు ఉపయోగించినా ఏ ఒక్కరూ నమ్మవద్దని సూచించారు. నిబంధనలకు వ్యతిరేఖంగా ఏ ఒక్కరికీ కూడా, ఏ నాడూ కూడా మద్దతు ఇచ్చే ప్రసక్తి ఉండదని స్పష్టం చేశారు. ఎవరైనాదళారులు తన పేరు వాడుకుంటే అధికారులెవ్వరూ నమ్మవద్దని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు సంబంధించిన ప్రభుత్వ భూములుతో పాటు, ఏ సర్వే నెంబర్ భూమి, ఎన్ఒసి, ఇసి వివరాలు ఎవరు అడిగినా అందించేందుకు అధికారులకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రయివేటు భూములు అన్యాక్రాంతం కాకూడదు, నిబంధనలుకు వ్యతిరేకంగా ఏ పని జరగకూడదని తెలిపారు. ప్రజలందరికీ మేలు జరిగేలా, రాయచోటి అభివృద్ధికి అందరమూ కలసి ముందుకు నడుద్దామని శ్రీకాంత్ రెడ్డి వినయ పూర్వకంగా కోరారు.

ప్రజా సంక్షేమమే ఎన్ఎస్ఎస్ లక్ష్యం

- అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి

రాయచోటి: ప్రజా సంక్షేమమే ఎన్ఎస్ఎస్ విద్యార్థుల లక్ష్యమని సాయి విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎంసుధాకర్ రెడ్డి అన్నారు. శనివారం రాయచోటిలో శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు ఏడు రోజుల ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి కరుణాకర్ మాట్లాడుతూ తమ కళాశాల నుంచి సుమారు 60 మంది ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు 7 రోజుల పాటు నిర్వహించిన శిబిరం ద్వారా పెదవీడు కొత్తపల్లి గ్రామ పరిధిలోని ప్రజలందరినీ కలిసి ఆరోగ్యం, చదువు, ప్రభుత్వ పథకాల పైన అవగాహన కల్పించారని తెలిపారు. మొక్కలను పెంచడం, నీటిని పొదుపు చేయడం,అంటు వ్యాధులపై అవగాహన కలిగించడం ప్లాస్టిక్ వాడకంపై కలిగే అనర్థాలను, బడి పిల్లలకు తల్లిదండ్రులకు ఉన్నత విద్య పై అవగాహన కల్పించడం, బడి మానేసిన పిల్లలకు చదువు ఆవశ్యకతను వివరించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారని చెప్పారు. శిబిరం మొదటి రోజున స్కూలు ఆవరణను శుభ్రం చేసి ఆరోగ్యం, పరిశుభ్రత పై అక్కడి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రేమాలయం వృద్ధాశ్రమంలో 210 మంది వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, ఎన్ఎస్ఎస్ విభాగం అధికారి కరుణాకర్ వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్ పరీక్షను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యార్థులకు మోడల్ ఎంసెట్, నీట్ పరీక్ష

రాయచోటి టౌన్ : శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షకు విశేష స్పందన లభించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ మేనే జింగ్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎస్ఎఫ్ఐ పోరాటాలేగాక ఇలాంటి మోడల్ పరీక్షలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులలో ఉన్న భయాన్ని పోగొ ట్టడానికి, సృజనాత్మకతను ప్రతిభను గుర్తించడానికి ఇలాంటి పరీక్షలు బాగా ఉపయోగపడుతాయని చెప్పారు. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా మే 15 నుండి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎంసెట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభను కనబరచాలని, తల్లిదండ్రులకు కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. భవిష్యత్తులో విద్యార్థులు సమాజ సేవా, దేశభక్తి , స్వతంత్ర సమరయోధుల స్ఫూర్తితో ఎస్ఎఫ్ఐ ముందుకు సాగుతుందని అన్నారు. విద్యార్థులు ఎస్ఎఫ్ఐని ఆదరించాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి మోడల్ ఎంసెట్ నీట్ మరెన్నో పరీక్షలు నిర్వహించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి టి.నరేష్, ఉపాధ్యక్షులు టి.శివకుమార్ కళాశాల అధ్యాపకులు నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీవారు

మదనపల్లె అర్బన్: పట్టణంలోని రెడ్డెప్ప నాయుడు కాలనీలో శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారు సూర్యప్రభ వాహనంపై ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్ బాషా హాజరై ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు వలన ప్రజల్లో దైవభక్తి పెరగడంతో పాటు, మంచి ఆలోచనలు అలవడుతున్నాయన్నారు. శ్రీవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేసుకున్నారు. అనంతరం రెడ్డెప్ప నాయుడు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ రెడ్డెప్ప నాయుడు కాలనీ, ఎస్‌బిఐ కాలనీలో నేడు పండుగ వాతావరణంలో స్వామి వారి ఊరేగింపు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో శ్రీవారి భక్తులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యాన్ని రగిలించే శ్రీశ్రీ కవిత్వం

ప్రజాశక్తి-కడప అర్బన్

శ్రీశ్రీ కవిత్వం సామాజిక చైతన్యాన్ని రగిలించే కవిత్వం అని వేంపల్లి ట్రిబుల్‌ఐటి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఇబ్రహీం అన్నారు. శనివారం నగరంలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ లెనిన్ ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీశ్రీ జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వం సామాజిక చైతన్యాన్ని రగిలించేదని, యువతను ఉత్తేజితులను చేసి సమాజ హితానికి మంచి చేసే విధంగా తయారవుతారన్నారు. సమాజం నుంచి రచయితలంతా చరిత్రను ఒకలాగా అర్థం చేసుకుంటే శ్రీశ్రీ చరిత్రలో సామాన్యుల కష్టాలను నష్టాలను బాధలను తన కవిత్వంలో చొప్పించారని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను అలరించేటువంటి మంచి పాటలను ఆయన రచించాడని తెలిపారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్లు ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ శ్రీ కవిత్వం కార్మికుల సామాన్యమైన శ్రామికుల యొక్క జీవితాన్ని లించే విధంగా ఆయన కవిత్వం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ సుబ్బారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు : టిడిపి

ప్రజాశక్తి - రాయచోటి

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, నేరాలు అవినీతి తప్ప జగన్‌కు ఏంతెలుసు అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాష పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తనక్రిమినల్ మైండ్‌తో 4 ఏళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని తెలిపారు. 31 కేసులున్న జగన్, 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని సూటిగా ప్రశ్నించారు. అహంకారికి అధికారమిచ్చిన ఫలితాన్ని ప్రజలు, రాష్ట్రం అనుభవిస్తున్నారన్నారు. క్రైమ్, కరెప్షన్‌తో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని వాపోయారు. ఎపి కంటే బీహార్ నయమనుకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఒకవైపు మీ బిడ్డను అంటూనే, మరోపక్క దుష్టచతుష్టయం అని ముఖ్యమంత్రి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని తీవ్రంగా విమర్శించారు. సొంతపార్టీ ఎమ్మెల్సీ దళిత యువకుడిని చంపి, జైలుకెళ్లి తిరిగొస్తే అతనికి ఘనస్వాగతం పలికారున్నారు. కార్యక్రమంలో మండల రూరల్ అధ్యక్షులు ఊరికి నాటి వెంకటసుబ్బారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి సత్యరెడ్డి, మాధవరం వెంకటరమణారెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నూలివీడు శివారెడ్డి, రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి హరి అమర్‌నాథరెడ్డి, గన్‌మెన్ రాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారతీయ అంబేద్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో శనివారం సిటిఎం క్రాస్ రోడ్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు ఏర్పాటు చేసిన, 14 వ ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. భారతీయ అంబేద్కర్ సేన, నారాయణ హృదయాలయ వారితో కలిసి ఏర్పాటు చేసిన ఈ గుండె వైద్య శిబిరాన్ని సిటిఎం క్రాస్ రోడ్ సర్పంచ్ భర్త మరియు ఏపీయూడబ్ల్యూజే స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండపల్లి అక్కులప్ప, బాస్ నేత పిటిఎం శివప్రసాద్, గుండె వైద్య నిపుణుడు డాక్టర్ కిరణ్ లతోకలిసి, అఖిల భారత గాండ్ల, తెలికల సంక్షేమ సంఘం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బండపల్లి వెంకటరమణ ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో నారాయణ హృదయాలయ వైద్య బృందం పాల్గొని 142 మందికి స్క్రీనింగ్ చేశారు. ఈసీజీ, ఎకో, బిపి, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, డాక్టర్ కన్సల్టేషన్ కూడా ఉచితంగానే అందజేశారు. పరీక్షల్లో 7 మందికి గుండె సంబంధిత జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ చేశారు. వీరికి కోలార్ లోని నారాయణ హార్ట్ సెంటర్ నందు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా శస్త్ర చికిత్సలు అందించనున్నట్లు బాస్ నేత శివప్రసాద్ తెలిపారు.

నృత్య, సంగీత కోర్సుల్లో ప్రవేశాల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయంలో కూచిపూడి నృత్యం, కర్నాటక సంగీతం, కీబోర్డ్ సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును మే 8వ తేదీ వరకు పొడిగి స్తున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగ య్య ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సులకు సంబంధించిన వివరాల కోసం www.yogivemanauniversity.ac.inలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మేల్కొలుపేదీ! ప్రజా'దృష్టి'

ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి కడప జిల్లా అట్టడుగున నిలిచింది. కొన్నేళ్లుగా అట్టడుగు వరుసలోనే నిలుస్తోంది. సమాజంలో విద్యా రంగానికి ఎనలేని ప్రాధాన్యత ఏర్పడింది. విద్యారంగ ప్రాముఖ్యత పట్ల అవగాహన పెరిగినప్పటికీ అదేస్థానంలో నిలుస్తోంది. పదవ తరగతి ఫలితాల్లో ఐదారు స్థానాల్లో నిలుస్తున్న జిల్లా ఇంటర్‌లో అట్టడుగు స్థానానికి పడిపోవడంలోని మతలబేమిటో తెలియడం లేదు. రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, నెల్లూరు వంటి ప్రాంతాల్లోని కార్పొరేట్ స్కూళ్లకు క్రీమ్ వెళ్లిన నేపథ్యంలో జిల్లా కింది వరుసలో నిలుస్తోందని చెప్పడం సహేతుక సమాధానం కానేరదని గ్రహించాలి. ధనికుల పిల్లలు కార్పొరేట్ కళాశాలలకు వెళ్తే, సామాన్యుల పిల్లల్లో మెరుగైన క్రీమ్ ఉండనే ఉంటుంది. వారినే సానబడితే మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉంది. దీనికి సమాధానమే మిటో ఆలోచించాల్సి ఉంది. ఈదిశగా పాలకులు ఎందుకు ఆలోచించడం లేదో తెలియాల్సి ఉంది. 2023-24 అకడమిక్ సంవత్సరంలో జిల్లాలో 35,856 వేల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయగా 46 నుంచి 60 శాతం ఉత్తీర్ణత సాధించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వానికి పదవ తరగతి ఫలితాల పట్ల ఉన్న శ్రద్ధ ఇంటర్ ఫలితాలపై లేదనడానికి ఫలితాలే నిదర్శమని తెలుస్తోంది. ప్రభుత్వం టెన్త్ ఫలితాలను సీరియస్‌గా తీసుకున్న తరహాలో ఇంటర్ ఫలితాలను తీసుకోవడం లేదని చెప్పవచ్చు. టెన్త్ పరీక్షల సమయానికి డిస్ట్రిక్ట్ కమిటీ రూపకల్పన చేసిన మెటీరియల్ అందించే సమయానికి నాలుగు నుంచి ఆరు సార్లు సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్ చేయిస్తోంది. ఫెయిలైన, మార్కులు తగ్గిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు నిపుణులను బాధ్యులుగా చేస్తోంది. ఇంటర్ విద్యార్థుల విషయంలో ఎందుకు శ్రద్ధ తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. విద్యార్థి జీవితంలో కీలకమైన దశలో విద్యా రంగాన్ని గాలికి వదిలేస్తోంది. ఫలితంగా విద్యావంతుల, ధనవంతుల పిల్లలు కార్పొరేట్ కళాశాలలకు పరుగులు తీయడం పరిపాటిగా మారింది. ఇది కార్పొరేట్ కళాశాలల దోపిడీకి దారితీస్తోంది. ఫీజులు పేరుతో లక్షలాది రూపాయలను దోపిడీ చేయడం పరిపాటిగా మారింది. అబూత కల్పనలు, అందమైన కలలు, ఎన్నో ఆశలు పేర్చిన మాయమాటలతో సామాన్యులను బోల్తా కొట్టించడం అనుభవైద్యేకమే. కార్పొరేట్ ప్రపంచంతో పోటీపడలేని పేద విద్యార్థుల మనుగడ కోసం పోరాటంలో కనుమరుగై పోతున్న దుస్థితి దాపురించింది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో నిరుపేద యువత దుర్వ్యసనాల బారినపడి, అసాంఘిక శక్తుల గుప్పిట్లో చిక్కుకుని విలవిలాడుతున్న దృశ్యం ఆవిష్కృతమవుతోంది. ఇటువంటి విద్యార్థులు ఇటు తల్లిదండ్రులకు, అటు సమాజానికి భారంగా మారిన పరిస్థితి కళ్లకు కడుతోంది. ఇటువంటి విష సంస్కృతిని రూపు మాపాల్సిన అవసరం ఉంది. విద్యారంగాన్ని ప్రయివేటీకరణ బారి నుంచి తప్పిస్తే ఇటువంటి విషసంస్కృతిని చరమగీతం పాడినట్లు అవుతుందని చెప్పవచ్చు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఇదేంఖర్మ కార్యక్రమంలో టిడిపి నాయకులు

టిడిపితోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తెలుగుదేశం పార్టీ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాజంపేట పార్లమెంటు టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రెడ్డివారిపల్లి పంచాయతీలోని వడ్డేపల్లి, దుర్గంవారిపల్లి, పిట్టావాండ్లపల్లి ఇదేంఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ఆదేశాల మేరకు వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఎండ కట్టడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజలు అనేక సమస్యలతో విసికి వేసారి పోయారని, టిడిపి పరిపాలన కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. ప్రధానంగా కుటుంబ బాధ్యతలను మోస్తున్న మహిళలు నిత్యవసర వస్తువులను కొనలేక, అధిక ధరతో గ్యాస్ ను కొనలేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిరత్నం, లక్ష్మన్న, మురళీమోహన్, రాజానాయుడు, రామచంద్ర, మునెప్ప, గణేష్, బూత్ ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

సమతవాది డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహవిష్కరణ కార్యక్రమం మండల పరిధిలోని చెన్నారాయునిపల్లి వద్ద ఆదివారం జరుగుతుందని బాస్ నాయకులు పేర్కొన్నారు. శనివారం ఈ విగ్రహావిష్కరణకి సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు. అంబేద్కర్ వాదులు, బాస్ నాయకులు, కార్యకర్తలందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాస్ సీనియర్ నాయకులు సింగన్న, సచిన్, మండల అధ్యక్షులు పలక వెంకటేష్, కొగర మాధవ, సొట్ట గంగాద్రి, నల్లగొల్ల మణి, చెన్నరాయునిపల్లి యూత్ నరేష్, నాగేష్, నవీన్, రెడ్డిశేఖర్, ఆనంద్, మల్లికార్జున, అరవింద్, ఆంజనేయులు, వేణుగోపాల్, నాగేంద్ర పాల్గొన్నారు

కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కుక్కకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

ప్రపంచ పశు వైద్య దినోత్సవం సందర్భంగా రాజంపేట ప్రాంతీ య పశువైద్యశాలలో ఉప సంచాలకులు డాక్టర్ అబ్దుల్‌ఆరిఫ్ ఆధ్వర్యంలో శనివారం పెంపుడు కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్‌ఆరిఫ్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా మూడు పెంపుడు కుక్కలకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్స నిర్వహించి, 22 కుక్క లకు రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు. ప్రతి సంవ త్సరం ఏప్రిల్ చివరి శనివారాన్ని ప్రపంచ పశువైద్య దినోత్సవంగా జరుపు కోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. పశు వైద్యాధికారులు అంకి తభావంతో పనిచేసి నోరులేని మూగజీవాలకు వ్యాధి బారిన పడకుండా వ్యాధి నిరోధక టీకాల ద్వారా రక్షించి పశుసంతతి వృద్ధికి తోడ్పడుతూ దేశ ప్రగతిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. నూతనంగా ఏర్పాటు చేసిన శస్త్ర చికిత్స విభాగంలో పెంపుడు కుక్కలు, వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం జరుగుతుందని, జంతు యజమానులు స్వచ్ఛంద సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకొని కుక్కల ద్వారా మనుషులకు సంక్రమించే భయంకరమైన ర్యాబిస్ వ్యాధిని నివారించాలని కోరారు. కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ప్రతాప్, జూనియర్ వెటర్నరీ అధికారి ఎం.వరదయ్య పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి తల్లికి సన్మానం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డిల తల్లి పద్మావతమ్మను స్థానికులు ఘనంగా సత్కరించారు. పద్మావతమ్మ తంబళ్లపల్లెకు వచ్చి మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించారు. ప్రత్యేక పూజలు అభిషేకాలతో స్వామి వారికి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకోగా స్థానిక నాయకులు మెడికల్‌షాప్ నారాయణరెడ్డి, బిసి నాయకులు రామ్మూర్తి, కళాకారుల సంఘం అధ్యక్షులు కత్తి రామలింగారెడ్డి, స్థానిక మహిళలు శాలువా కప్పి సత్కరించారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

తంబళ్ళపల్లిలో శనివారం జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతి ప్రవేశాల కొరకు జరిగిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఇఒ త్యాగరాజు తెలిపారు. ఆదర్శ పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహించడం జరిగింది. ఆదర్శ పాఠశాలలో 133 మందికి గాను 112 మంది పరీక్ష రాశారు. తంబళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 168 మందికి గాను 156 మంది పరీక్ష రాశారు. మండలంలో మొత్తం 301 మందికి గాను 268 మంది పరీక్ష రాశారు. పరీక్షకు హాజరు కాని వారు 33 మందిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చీఫ్ ఆంజినేయులు, డిఒ చంద్రానాయక్, ఆదర్శ పాఠశాలలో చీఫ్ శంకరప్ప, డిఇఒ క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈ రెండు కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని నవోదయ విద్యాలయం సెంట్రల్ లెవల్ అబ్జర్వర్ బిందు పేర్కొన్నారు. రెడ్డప్పనాయక్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తుతో ఏర్పాటు చేశారు. కోసువారిపల్లె పిహెచ్‌సి వైద్య సిబ్బంది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

స్విమ్మింగ్‌పూల్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-గాలివీడు

మండంలోని స్థానిక కుషవతినది పక్కన గుండ్లూరు మస్తాన్‌బాబు స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేశారు. తనే కోచ్‌గా అక్కడ పిల్లలకు ఈత నేర్పిస్తున్నారు. విద్యార్థులకు వేసవి శెలవులు కావడంతో సమయాన్ని వృథా పోనివ్వ కుండా కాల క్షేపం కోసం ఈత నేర్చుకుంటే ఎప్పటికైనా ఉప యోగంగా ఉంటుందన్నారు. స్విమ్మింగ్ పూల్ ఎక్కువ లోతు లేకుండా పిల్లలకు తగినంత మోతా దు లోనే లోతు ఉంచి అందరికీ అను కూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చిన్నపిల్లలు మొద లుకొని పెద్దల వరకు స్విమ్మింగ్ పూల్ ఈత ఆడేందుకు అనుకూలత ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపటి నుంచి సమ్మర్ క్యాంప్ ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మే 1 నుంచి నిర్వహించనున్న మెగా సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని అకాడమీ గ్రాండ్ మాస్టర్ సునీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల 30 నిమిషాల వరకు, సాయంత్రం ఐదు గంటల నుంచి 6 గంటల వరకు జిఎంసి క్లబ్ ఆవరణలో మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. తేక్వాండో, కుంగ్‌ఫూ, సిలబం (కర్ర సాము) లలో నిష్ణాతులైన, అనుభవం గల మాస్టర్లచే శిక్షణ ఇవ్వబడుతుందని, ఈ మెగా సమ్మర్ క్యాంపును ఆసక్తిగల యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరములకు 9052794890, 9440500042 నంబర్లను చరవాణి ద్వారా సంప్రదించాలని కోరారు.

రేపు ఎంపీ పర్యటన

గుర్రంకొండ : రాజంపేట పార్లమెంట్ సభ్యులు ఎంపీ మిథున్‌రెడ్డి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొంటారని ఎంపిడిఒ వెంకటేశ్వర్లు తెలిపారు. సంఘ సముద్రం, ఎల్లుట్ల, టి.పసలవాండ్లపల్లి గ్రామాలలో గడపగడప కార్యక్రమాన్ని ఎంపీ మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే రామచంద్రరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. గ్రామాలలో వచ్చిన సమస్యలపై అధికారులతో సోమవారం సమీక్ష సమావే నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు.

‘జగనన్నే మా భవిష్యత్తు’ విజయవంతం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా

ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతమైందని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిలు సంయుక్తంగా తెలి పారు. బోయినపల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మేడా, ఆకేపాటిలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడపగడపకు అందుతున్న సంక్షేమ పథకాలపైన ప్రజలలో విశేష స్పందన ఉందని తెలిపారు. నియోజకవర్గంలో 80 వేలకు పైగా కుటుంబాల నుంచి మిస్డ్‌కాల్ లు వచ్చా యన్నారు. ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ ప్రజలు సంతకం చేసిన పుస్త కాలను ఈ సందర్భంగా వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** మండలంలో జగనన్నే మా భవి ష్యత్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయ వంతంగా పూర్తి చేసినట్లు వైసిపి మండల సచివాలయాల కన్వీనర్ రెడ్డిహరి పేర్కొన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా వారి అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు

చిరుధాన్యాల్లో అధిక పోషకాలు

సమావేశంలో మాట్లాడుతున్న కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ

ప్రజాశక్తి-కలికిరి

చిరుధాన్యాల్లో అధిక పోషకాలు ఉంటాయని కెవికె సమన్వకర్త పాండురంగ పేర్కొన్నారు. కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో చిరుధాన్యాల విలువ ఆధారిత ఉత్పత్తులు, పోషకాల ప్రాముఖ్యత అనే అంశంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిరుధాన్యాల విలువాధరిత ఉత్పత్తుల తయారీతో పాటు వివిధ రకాల ప్యాకింగ్ విధానాలు, ప్యాకింగ్ మెటీరియల్ మార్కెటింగ్ విధానంలో ప్యాకింగ్ పాముఖ్యత, లేబులింగ్ వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఎఫ్ఎస్ఐ సర్టిఫికెట్ విదానం దాని ప్రాముఖ్యత గురించి వివరించారు. స్వయం ఉపాధి సంఘ సభ్యులు చిరుధాన్యాల విలువలతో ఉత్పత్తుల ద్వారా ఆర్థిక స్వాలంభన ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. చిరుధాన్యాల పంట ఉత్పత్తి, పంట పండించే విధానంలో తీసుకోవాల్సిన మెలుకులు అలాగే నూతన రకాల గురించి సోమశేఖర్ సేద్య విభాగం శాస్త్రవేత్త మహిళా రైతులకు వివరించారు. కార్యక్రమంలో జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

పిల్లలకు ఉన్నత విలువలు నేర్పించాలి

ప్రజాశక్తి-గాలివీడు

మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు ఒ.నిర్మల

మంచిని ప్రోత్సహించే విధంగా పిల్లలకు ఉన్నత విలువలు నేర్పించాలని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయురాలు ఒ.నిర్మల పేర్కొన్నారు. శనివారం బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ కుందా లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన స్కూల్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ పిల్లలను విద్యపై ప్రోత్సాహం అందించాలని రాబోయే విద్యా సంవత్సరం నుంచి బాలికల ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల క్లాసులు కూడా ప్రారంభిస్తున్నామని అన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ పాఠశాలలో ప్రతిభకు ప్రాధాన్యతకు దృష్టిపెట్టి మెరిట్ అయిన విద్యార్థుల పైన దృష్టి లేకుండా చదువులో వెనుకబడిన ప్రతి విద్యార్థిపై దృష్టి పెట్టి ఉపాధ్యాయులు అందరూ కృషి ఫలితంగా మంచి ఫలితాలతో ముందు సాగుతున్నామని అన్నారు. రాబోయే విద్యా సంవత్సరం నుంచి కళాశాల ఇంటర్మీడియట్ కళాశాల మంజూరు అవుతుందని ఉపాధ్యాయులు అందరూ కష్టించి కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మావతి, వసుంధర, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ పావని లక్ష్మయ్య, కరుణాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-గాలివీడు

పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్‌పి గంగాధర్‌రావు

మండల కేంద్రంలోని గాలివీడు పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఎస్‌పి రెడ్డిగంగాధర్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే పెట్రోల్ బంకును రికార్డులను తనిఖీ చేసి సిబ్బందిని అభినం దించారు. పోలీస్ స్టేషన్ చుట్టూ ఆహ్లాదకరంగా గార్డెన్ తలపించే విధంగా చల్లని వాతావరణం ఉండాలని అని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ క్వాటర్స్‌లో ఉన్న స్థలంలో కాంప్లెక్స్ ఏర్పాటుకు ముఖ్యమంత్రితో కూడా మాట్లాడనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భూములు విలువ పెరగడంతో సమస్యలు ఎక్కువ వస్తున్నాయని రెవెన్యూ అధికారులతో సంప్రదించి భూ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. వెలిగల్లు, తూముకుంట, ఎన్‌పికుంట ప్రాంతాల్లో ఉన్న సోలార్ ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. కూరగాయల సంత, గురు వారం జరిగే గొర్ల సంతకు ట్రాఫిక్ సమస్యను క్రమ బద్ధీకరిస్తామని చెప్పారు. కారిస్తామని సిబ్బంది తక్కువగా ఉన్నారని వాటిని కూడా వీలైనంత త్వరలో పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

అగ్నికి ఆహుతి అవుతున్న అరటి తోట

అరటి, నిమ్మ తోట దగ్ధం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పెరియవరం రెవెన్యూ పొలంలో అప్పయ్య రాజుపేట గ్రామానికి చెందిన లగిడి వెంకట నరసరాజు కి సంబంధించిన రెండు ఎకరాల పొలంలో శనివారం నాడు గుర్తుతెలియని వ్యక్తి అరటి తోటకు నిప్పంటించడం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకి వెళితే రైతు పొలంనే నమ్ముకుని బ్రతుకుతున్న ఈ సమయంలో తోట లో అరటికాయలు తెగుతున్న సందర్భంలో తోట దగ్ధం అవడం పట్ల రైతు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా హుటాహుటిన ఫైర్ అధికారులు వచ్చి మంటలను అదుపు చేసే లోపల రైతు కి ఉన్న రెండు ఎకరాల పొలంలో అరటి నిమ్మ తోట లు రెండు పూర్తిగా దగ్ధం అయిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి కాలిపోయిన తోటను పరిశీలించి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించవలసిందిగా రైతు తెలియజేశారు.

విద్యతో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందొచ్చు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

విద్య ఉంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందవచ్చు అని పెద్దమండ్యం సర్పంచ్ బాషా, ఎంపిటిసి జయరామ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గాజుల రామకృష్ణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి తల్లిదండ్రులు తమపిల్లలను ఇంటి దగ్గర చదువుకోవడం కోసం ప్రయత్నం చేయాలని అన్నారు. పాఠశాల పరిసరాల్లో మూడవ తరగతి విద్యార్థులను చేర్పిచాలన్నారు.విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టులను విద్యార్థుల తల్లి దండ్రులకు అందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటి చైర్మన్ ఈశ్వరమ్మ, కమిటీ సభ్యులు ,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేసవి సెలవులు ప్రారంభం

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాల ఒకటవ తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు సోమవారం నుంచి జూన్ 11 వరకు పాఠశాలలు మూసి వేయడం జరుగుతుందని ఎంఇఒ రంగనాథయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం జూన్ 12వ న అన్ని యాజమాన్యాల పాఠశాలలో పున ప్రారంభం అవుతాయన్నారు. ఎవరైనా ప్రయివేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వేసవి సెలవులలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాఠశాల యాజమాన్యాలకు హెచ్చరించారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-కలికిరి

క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అపర్ణ తెలిపారు. కలికిరి జెఎన్‌టియు కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎల్ స్పెషల్ క్యాంపులో భాగంగా శనివారం మరికుంటపల్లి గ్రామం కొట్టాలలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వివిధ రకాల క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలు కూడా విద్యా ర్థులకు ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కె.అపర్ణ, కొటాల గ్రామం ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు మోహన్‌రెడ్డి, స్వరూప, మెహతాజ్, కళాశాల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

కడప విద్యాసాగర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో నిర్వహించబోయే ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు, ఉపాధ్యాయులు ఉపయోగించుకోవాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రముఖ ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ నిపుణులు డాక్టర్ విద్యాసాగర్ ఉచిత వైద్యశిబిరంలో పాల్గొని పరీక్షలు చేస్తారన్నారు. మోకాళ్ల నొప్పి, ఇతర ఆర్థో సంబంధ సమస్యలతో బాధపడేవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-చెన్నూరు

మండల కేంద్రంలోని సచివాలయం–3లో ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో బలసింగాయనపల్లిలో ఉండేది. ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని చెన్నూరుకు మార్చామని మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జికి సన్మానం

ప్రజాశక్తి - కడప

జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.మోతిలాల్ మూడు సంవత్సరాల పాటు మంచి పనితీరు కనబరిచి కృష్ణాజిల్లా తిరువూరు న్యాయస్థానానికి బదిలీ అయిన సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెన్నపూస మధురెడ్డి, ఆయనకు ఆత్మీయులు బి3 జిమ్ డైరెక్టర్ బాబా మొహిద్దిన్ ,మౌల, సతీష్, రామకృష్ణ, గంగాధర్, సోహెల్, మన్సూర్, ముస్తాక్, లతీఫ్, డాక్టర్ దినేష్ శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మధురెడ్డి మాట్లాడుతూ జిల్లాలో న్యాయం కోసం ఆశ్రయించిన ఎంతోమంది ప్రజలకు న్యాయం చేసి వారి మనస్సులో నిలిచిపోయారని పేర్కొన్నారు.

‘జగనన్నకు చెబుతాం’ హాస్యాస్పదం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలు ఒక వైపు జగనన్నను దించుతామని అంటుంటే.. వైసిపి ప్రభుత్వం మరో వైపు జగనన్నకు చెబుతాం అనే కార్యక్రమాన్ని మే 9 నుండి ప్రారంభించాలని నిర్ణయించడం హాస్యాస్పదమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లా డుతూ గిట్టుబాటు ధర లభించక, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. పావలా వడ్డీ పథకం, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ లేక రాష్ట్ర వ్యాప్తంగా రైతులు జగనన్నను దించుతామని అంటున్నారని తెలిపారు. నిత్యా వసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. మద్య నిషేధం బదులు మద్యం నిషా పథకంగా అమలు అవుతున్నట్లు చెప్పారు. రాజధానిని అమ రావతి నుండి విశాఖపట్నం తరలించవద్దని అమరావతి మహిళలు, రైతులు, రాష్ట్ర ప్రజలు గొంతెత్తి చెబుతుంటే వినిపించుకోని జగన్‌కు చెప్పి ప్రయోజనం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారని విమర్శించారు. జగనన్నకు చెబుతాం అనే కార్యక్రమం ఘోర వైఫల్యం కాక తప్పదని తులసిరెడ్డి పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గువ్వలచెరువు లోయలో లారీ బోల్తా

డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ప్రజాశక్తి-రామాపురం

కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారి మండల పరిధిలోని గువ్వలచెరువు ఘాట్ రెండవ మలుపు వద్ద లారీ అదుపుతప్పి లోయలో పడిపోయింది. మాచర్ల నుంచి బెంగళూరుకు సిమెంట్ లోడ్‌తో బయలుదేరిన లారీ శనివారం మండల పరిధిలోని గువ్వల చెరువు ఘాట్ రెండో వద్ద మలుపు వద్ద లారీ అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురేష్‌కు రెండు కాళ్ళు విరిగి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు హైవే సిబ్బంది చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

ఆత్మహత్యకు పాల్పడ్డ గణేష్

రుణదాతల వేధింపులు తాళలేక ఓ భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిమ్మనపల్లి పంచాయతీ ఎద్దులవారిపల్లికి చెందిన పత్తికొండ.కృష్ణమూర్తి కుమారుడు పత్తికొండ గణేష్(30) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవిస్తు న్నాడు. కుటుంబ పోషణకై రూ.6లక్షల వరకు అప్పులు చేయడంతో, గత కొంతకాలంగా రుణదాతల నుంచి వేదింపులు అధిక మయ్యాయి. ఈ క్రమంలో శుక్రవారం కూడా రుణదాతల వేధింపులు అధికం కావడంతో అప్పుల బాధలు భరించలేక మనస్థాపం చెంది శుక్రవారం రాత్రి ఎద్దులవారిపల్లికి సమీపంలోని చింతచెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న గణేష్‌ను హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య రెడ్డిలక్ష్మి, కుమార్తెలు నందిని(9), దీపిక(7), కుమారుడు మనోజ్(3) ఉన్నారని తెలిపారు. చిన్న వయసులోనే గణేష్ మృతి చెందడంతో అతని కుటుంబం భార్య, పిల్లలు అనాథలయ్యారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగిం చారు. సంఘటనపై మృతుని భార్య రెడ్డిలక్ష్మి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయ డంతో హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలి పారు.

మృతిచెందిన లక్ష్మి ప్రసన్న

నందలూరులో వివాహిత..

ఉరివేసుకొని వివాహిత మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన నందలూరులో జరిగింది. వివరాల్లోకెళ్తే మండల కేంద్రమైన నందలూరు బ్రాహ్మణవీధిలో నివాస ముంటున్న పామూరు లక్ష్మి ప్రసన్న (22) శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. సిద్ధవటం మండలం వన్ మాధవరం కు చెందిన మృతురాలు ఏడాదిన్నరకితం నందలూరు నాగిరెడ్డి పల్లెకు చెందిన పామూరు సాయి మదన్‌తో ప్రేమ వివాహం చేసుకుంది. గత ఆరు నెలలుగా పుట్టింటికి, అత్త గారింటికి దూరంగా బ్రాహ్మణవీధిలో ఇల్లు తీసుకుని కాపురం ఉంటున్నారు. గత కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చునని స్థానిక ప్రజలు చర్చించు కుంటున్నారు. సంఘటనా స్థలాన్ని సిఐ పుల్లయ్య, తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజు, ఎఎస్ఐ సుబ్బరాయుడు పరిశీలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి శవ పరీక్ష నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

బాలుడి అదృశ్యం : కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మహమ్మద్ ఇషాక్(ఫైల్ పోటో)

బాలుడు అదృశ్యమైన సంఘటన పట్టణంలో చోటుచే సుకుంది.ఎస్ఐ.రామ్మోహన్ కథనం మేరకు వివరాలు..పట్టణంలో సింహం వీధిలో నివాసముంటున్న మల్లూరి షౌకత్ కుమారుడు మల్లూరి మహమ్మద్ ఇషాక్(12) అనే బాలుడు ఈనెల 28న శుక్రవారం రంగసముద్రం రోడ్డులో ఉన్న ప్రతిభ కోచింగ్ సెంటర్‌కు తన చెల్లెలు, అన్నతోపాటు కలిసి ట్యూషనుకు వెళ్ళాడని, తిరిగి సాయంత్రం 5.30 గంటలకు ఇంటికి వచ్చే క్రమంలో మార్గమధ్యలో సింహం స్ట్రీట్ నందు తన చెల్లితో నేను నా స్నేహితుడి ఇంటికి వెళ్లి హోంవర్క్ రాసుకొని వస్తానని చెప్పి వెళ్లాడన్నారు.అయితే ఎంతసేపటికి తమ కుమారుడు ఇంటికి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు బంధువులు,స్నేహితుల ఇళ్లల్లో వెతికారని ఆ బాలుడు కనబడకపోవడంతో శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.సదరు బాలుడు ఆచూకీ ఎవరికైనా తెలిస్తే ఎస్ఐ రామ్మోహన్ 9440900707 అనే మొబైల్ నెంబరుకి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-నందలూరు

కడప–చెన్నై జాతీయ రహదారిలోని నందలూరు చెయ్యేరు వంతెన పై గేదె అడ్డం రావడంతో దాన్ని తప్పించబోయి డివైడర్ పైకి కారు దూసుకుపోయింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. వివరాల్లోకెళితే శనివారం నెల్లూరుకు చెందిన ఒక కుటుంబం రాంజపేట బోయినపల్లి లోని బంధువుల ఇంటికి వచ్చి ఒంటిమిట్టలోని ఆలయంలో దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో బోయినపల్లికి వెళ్తుండగా ఈ సంఘటన జరిగింది. కొందరికి తీవ్ర గాయాలు అయినట్లు సమాచారం దీనిపై నందలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెహర్‌బాబా నగర్‌లో చోరీ

నగదు, బంగారం అపహరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దొంగతనం జరిగిన గదిలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

పట్టణంలోని నలంద పాఠశాల వద్ద గల మెహర్ బాబా నగర్ లో గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఇంటిలో చోరీ చేసి నగదు, బంగారాన్ని అపహరించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మెహర్ బాబానగర్‌కు చెందిన అశోక్ పిఆర్‌ఆర్‌డిలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన భార్య ప్రియాంక అప్పారాజుపేటలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పిల్లలు సెలవులు కావడంతో లక్కిరెడ్డిపల్లెలోని తమ అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. దంపతులిద్దరూ ఉద్యోగులు కావడంతో ఉదయాన్నే ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారని ఇంటి యజమాని అశోక్ తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి కటాంజనంకు ఉన్న తాళాలు పగలగొట్టి, ఇంటిలో వస్తువులన్నీ చిందరవందరగా ఉండడంతో అనుమానించి చూసేసరికి బీరువాలో ఉన్న నగదు, బంగారం అపహరణకు గురి అయినట్లు తెలిసిందని బాధితులు తెలిపారు.రూ.1.50 లక్షలు నగదు, బంగారం ఉండగా కేవలం రూ.50 వేలు నగదుతో పాటు కొంత బంగారం వదిలేసి 11.5 తులాల బంగారం పట్టుకెళ్లారని తెలిపారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

కడప : పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ ఏ. నాగరాజు సూచించారు. ప్రభుత్వ పురుషుల కళాశాల స్వయం ప్రతిపత్తి కడప ఎన్ఎస్ ఎస్ యూనిట్ యొక్క స్పెషల్ క్యాంపు సందర్భంగా కళాశాలలో చెత్తను, ప్లాస్టిక్‌ను తొలగించి రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, పిఒ డాక్టర్ అంకాల నాగరాజు పాల్గొన్నారు.